# కీడు

ఆనాటి తాటితోపులో పొద్దుటి నుంచి మధ్యాహ్నం దాకా కల్లు తాగిన సుధాకరరావు, నిద్రపట్టి, తాటిబొందల నీడన పడుకొని, మాపిటేలకు కూడా లేవలేదు.

రెండేళ్ల పిల్లోణ్ణి నడిపిస్తూ ఏడాదివాణ్ణి ఎత్తుకొని, ఆర్నెల్ల గర్భవతి రత్తమ్మ మొగుడి కోసం ఊరంతా వెదుకుతుంటే కల్లుగీత గమళ్ల పెత్తాత "ఆడు అనాటితోపులో పడుండాడు" అని చెప్పాడు.

పిల్లల్ని మాదిగ పల్లెలో పక్కింటివాళ్లకు అప్పగించి పొద్దు కుంకినాక కోసెడు దూరమున్న తోపుకు బయలుదేరింది రత్తమ్మ.

చీకట్లో పురుగూ పుట్రా తిరిగే తోపులో అతణ్ణి వెతికి, ఇంకా మత్తులో నిద్రపోతున్న భర్తను లేపి, నడవమంటే నడవలేకపోతుంటే, నడిపిస్తూ, అయినా జారిపడుతుంటే భర్త తల భుజం మీద పెట్టుకొని, నడుం చేత్తో పట్టుకొని, జారబీక్కొంటూ లాక్కొచ్చి ఇంట్లో మంచం మీద పడుకోబెట్టింది.

వీళ్ళిద్దరికీ మూడేళ్ల క్రితం పెళ్లయింది. వెంటనే ఆమె కాపురానికి వచ్చింది. ఆమెకు ఇరవై, అతడికి ఇరవై రెండేళ్లు, ఇప్పుడు.

నాలుగేళ్ల క్రితం తండ్రి గతించాడు. చిన్నతనంలోనే తల్లి కాలం చేసింది.

తండ్రి ఊరి వెట్టి. ఖాళీలో కొడుకును చేరమంటే చేరాడు. పొరుగూరు మారాజు నా కూతుర్ని పెళ్లాడమంటే సరేనన్నాడు. పెళ్లయిపోయింది.

ఐదేళ్ల క్రితం తండ్రి బ్రతికి ఉండగా యంసెట్ రాశాడు. తండ్రి పోయినేడూ రాశాడు, మెడిసిన్‌లో చేరాలని. చేరే రేంక్ రాలేదు. చేరలేదు. డాక్టరు కావాలని కోరిక నెరవేరలేదు. ఇంక చదువుకోబుద్ధి పుట్టలేదు. మానేశాడు. ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, కల్లు. మరి వెనక్కు తిరిగి చూడలేదు సుధాకరరావు. కల్లు కాదంటే సారాయి. అది కాదంటే రమ్ము. బ్రాందీ, విస్కీ.

సుధాకరరావు ఉన్న కాస్తంత పొలం అమ్మేశాడు. తాగేశాడు. ఉన్న పశువులు, పనిముట్లు అమ్మి తాగి తందనాలాడి స్వర్గం చూశాడు.

మెడిసిన్ కాకపోతే మరి చదువు అక్కరలేదని కాలేజీ చదువు వదిలేసి , సంసార సాగరంలో, కల్లు సముద్రంలో మునిగి తేలుతున్నాడు.

చెప్పేవాళ్లు లేరు. అతను వినేవాడు కాడు.

ఇల్లూ వాకిలీ అమ్మేసి తాగేవోడే... మామ అడ్డుపడి ఉండకపోతే!

వెట్టి జీతం చేతికీ మూతికీ చాలదు. కల్లుకు సరిపోతుంది. చాలకపోతే ఊళ్లో పుణ్యాత్ములు ధర్మం చేయకుండా మానరు. అదీ కాకపోతే గమళ్ల పెత్తాత దయ తలవక మానడు.

నెలనెలా బియ్యం పప్పు తెచ్చి పడేసి పోతుంటాడు పిల్లనిచ్చిన మామ!

రత్తమ్మ బుద్ధిమంతురాలు. ఒద్దికైన అమ్మాయి. మొగుడంటే వల్లమాలిన ప్రేమ! వండి ఇంత పెడుతుంది.

'ఎటువంటోడు ఎట్టా అయిపోయేడు!' అని పల్లెలోవాళ్లు దిగులు పడుతుంటారు.

శుభ్రంగా స్నానం చేసి, చక్కగా తల దువ్వుకొని, ఉతికిన బట్టలేసుకొని దొరబాబులాగా స్కూలుకు, కాలేజీకి పోయివచ్చే సుధాకరరావు పూర్తిగా మారిపోయాడు.

దుమ్ము కొట్టుకొని ఉంటాడు. స్నానం చేయడు. వెట్టికి అవే బట్టలు, తాగుడుకి అవే బట్టలు, పడక్కీ అవే బట్టలు. చేతిలో కఱ్ఱ లేకపోతే నడవలేడు. స్టెతస్కోపు పట్టుకుని, బూటూ, కోటూ వేసుకుని, హాస్పటల్ వరండాలో టకటకలాడుగూ తిరుగుతానని కలలు కన్న తాను, డొంకలో, తాటి తోపుల్లో చెప్పుల్లేని కాళ్లతో కఱ్ఱపోటుతో నడుస్తుంటే దిగులుగా ఉంటుంది.

'అనుకొన్నవన్నీ జరగవు, జరక్కపోతే జీవితం ముగిసిపోదు. మరో మార్గం చూసుకోవడం న్యాయం'

మునసబు ఎన్నోసార్లు హెచ్చరికలు చేశాడు. సుధాకరరావు విన్నట్లుగా తల వూపేవాడు. కానీ కల్లు మానలేదు.

కల్లు వళ్లు గుల్ల చేస్తుంటే 'నిజమే'నని ఒప్పుకున్నాడు. కానీ మానలేదు.

'ఇంటర్ ఎనభై మార్కులదో పాసయ్యావు కదా! ఏదైనా ఉద్యోగం చూసుకోకూడదా?' అంటే 'ఇప్పించండి' అని మౌనంగా ఉండేవాడు. డాక్టరు కానప్పుడు ఏ ఉద్యోగం చేసినా, చేయకపోయినా ఒక్కటే అని గొణుక్కొనేవాడు.

సుధాకరరావు ఎంతో అందంగా, ఠీవిగా ఉండేవాడు. ఇప్పుడు అందం చందం గంగలో కలిశాయి. ఠీవీ, దర్పం పుస్తకాల పుటల్లో దాగి, సంచిలో కూర్చుని గొడక్కొట్టిన మేక్కు తగులుకొని ఊగుతూ ఉన్నాయి.

మనిషి చిక్కిపోయాడు. కల్లు కంపు కొడుతున్నాడు. ముఱికి వాసన. కట్టుకొన్న పాపానికి కాపురం చేస్తూ ఉంది రత్తమ్మ.

తల్లి చనిపోయినప్పుడు, వైద్య సదుపాయం ఉంటే తల్లి బ్రతికేదని అందరూ ఏడుస్తున్నప్పుడు, డాక్టరు చదువు చదివి, రోగాల వల్ల పల్లెల్లో ఎవరూ చావకుండా వైద్యం చేసి బ్రతికించాలని పట్టుబట్టి చదివాడు.

డాక్టరు కావడమే లక్ష్యంగా చదువుకొన్న సుధాకరరావు, డాక్టర్ కావడం తెలివితేటల కారణంగా కాక, కోర్టులు కారణంటా సాధ్యం కాకపోవడంతో నిరాశకు లోనయ్యాడు.

మావూరి పిల్లవాడు డాక్టరు చదివి పల్లెకు వచ్చి, మా రోగాలు నయం చేస్తాడని, తనకు తమవాడి వైద్యం అందుతుందని నమ్మిన మునసబు దగ్గర వెట్టివాడుగా సుధాకరరావు పని చేస్తుంటే దిగులుగా ఉంటూ వచ్చింది, కానీ ఏం చేయగలడు మునసబు?

ప్రేమగా, దిగులుగా, కోపంగా గద్దించి చెప్పి చూశాడు మునసబు 'నిరాశ వద్దు! ఉన్నదానితో తృప్తిపడు. చెడిపోవద్దు'

గంగిరెద్దులా తల ఆడించి, పిచ్చి గోమాతలాగా వెళ్లిపోయేవాడు నెమ్మదిగా సుధాకరరావు.

తన స్థితి మీద తనకు కోపం వెలిగక్కడు. ఆవేశపడదు. తిట్టడు.... కొట్టడు... తనలో తాను కుమిలిపోతాడు. క్రుంగిపోతాడు. దిగులు, వేదన మాయమవుతాయని తాగుడికి అలవాటు పడ్డాడు.

లోపల అగ్ని పర్వతం పగిలి బద్దలయితే మనిషి తేరుకుంటాడు. బద్దలు కాదు. లోపల్లోపలే కుమిలిపోతుంటాడు. కాలిపోతుంటాడు. బూడిద అయిపోతుంటాడు.

'పెళ్లాం పిల్లలున్నవాడివి. నీకు నువ్వే హాని చేసుకొని కుమిలి చచ్చి, వాళ్లను దిక్కులేని వాళ్లను చేయవద్దు' అని మునసబు చిలక్కి చెప్పినట్లు చెప్పాడు.

సుధాకరరావు అవుననలేదు, కాదనలేదు. బదులాడలేదు. భారంగా కదిలి వెళ్లిపోయాడు.

ఆత్మహత్య అయితే క్షణాల్లో ఫలితం వస్తుంది. కానీ ఈ పొడిగింపు పొందుతున్న మరణ చర్య బాధాకరంగా ఉంది. ఇంత హింసపడే హాని మార్గం ఇతనెందుకు ఎంచుకొన్నాడో ఎవరికీ అర్థం కాదు.

తాగుడు దానంతట అదే అంత ప్రమాదం కాకపోవచ్చు. కానీ బ్రతకరాదని, బ్రతికే మార్గం లేదని, బ్రతకవలసిన అవసరం లేదని, చనిపోవాలని నిశ్చయించుకున్నట్లు బ్రతుకుతున్న మనిషిని రక్షించడం సాధ్యం కాదనిపిస్తుంది.

ఎవరెవరో ఎన్నెన్నో మంచి మాటలు చెప్పి చూశారు. ఫలితం లేకపోయింది.

ఎవరి ఉపదేశాలూ పనిచేయలేదు.

కల్లు తాగినా, నీళ్లు తాగినా, నడిచినా, సంసారం అంతా కసిగా, పగగా, ద్వేషంగా చేస్తుంటే అతను పిచ్చివాడయ్యాడని అనిపించసాగింది.

దేనిమీదా ప్రేమలేదు. భార్య ప్రేమ, పిల్లల ప్రేమ, ముద్దు మూటగట్టిననట్లుండే మురిపాల మాటలు.... ఏవీ అతని గుండెకాయను గిల్లలేకుండా ఉన్నాయి.

కసి, కోపం, ద్వేషం అన్నీ ఎవరిమీదా కాదు. కోర్టు మీద. కోర్టును కొట్టగలడా? తిట్టగలడా? కఱ్ఱతో బాదగలడా? కత్తితో నరకగలడా?

తనకు తాను హాని చేసుకొనేవాడి కసి గొంతు పిసుక్కొనేట్టు చేయగలదు కానీ, మరొకరిని ఏమీ చేయలేదు.

ఏమయినా చేయగలిగితే కోర్టునేమి చేయగలడు? అందుల్లో హైకోర్టునేమి అనగలడు?

హైకోర్టు అంతటి మీద కోపతాపాలు లేవు. తీర్పు మీద కోపం. తీర్పు తప్పు అని అతని విశ్వాసం.

తీర్పు తప్పయితే ఏం చేయాలి? బెంచికి అప్పీలు చేయాలి. ఫుల్‌బెంచి, సుప్రీం కోర్టు తనకు తాహతు ఉందా?

ఉన్నా ఎంతకాలం పడుతుంది, మంచి తీర్పు రావటానికి. అంతదాకా జీవితం ఆగుతుందా? పాఠం ఆగుతుందా? అడ్మిషన్లు ఆగుతాయా? ఆగవు.

పదేళ్లకో, పాతికేళ్లకో న్యాయం జరిగితే తాను పద్దెనిమిదేళ్ల వాడుగానే ఉంటాడా?

ఈలోగా తానేం చేయ్యాలి? వెట్టి! సంసారం! కల్లు! సారాయి! హాని! శరీర హాని! ఆత్మహాని! నిదానంగా నెమ్మదిగా ఆత్మహత్య!

ఏమీతినక, తాగక, పడినవాడు పడినట్లే నిద్రపోతుంటే పిల్లల్ని నిద్రకేసి, భర్తను చూస్తూ గోడకు అనుకొని కూర్చుని ఉన్న రత్తమ్మ. కళ్లు మూతలు పడి గోడవార జారి, చేయి దిండుగా నిద్రపోతూ వుంది.

స్వర్గం నుంచి తల్లి చేతులు చాచి పిలుస్తున్నట్లుగా ఉంటే పరుగెత్తబోయి జారిపడి, లేవలేక, పోలేక, ఏడుస్తూ కూలబడి ఉన్నట్లు కలగన్నాడు. అయినా సుధాకరరావు లేవలేదు.

కలల లోకం అతణ్ణి వదల్లేదు. మెడలో స్టెతస్కోపు వేసుకొని, బూటూ కోటూ తొడుక్కొని జనరల్ హాస్పటల్ వరండాలో ఒ.పి నుంచి వార్డుకు టకటక నడిచిపోతున్నట్లు కల వచ్చింది.

ఊలిక్కిపడి లేచి చుట్టూ చూశాడు. గోడవార భార్య నిద్రపోతూ ఉంది. చాపమీద పిల్లలు కాళ్లూ చేతులూ ఆరజాపి బారజాపి పడి ఉన్నారు.

సుధాకరరావు ఆవురుమన్నాడు. శబ్దం రాలేదు. కంట వెంట నీళ్లు కారిపోతున్నాయి. ఏమి జరిగి ఉంటుందో ఊహించుకోసాగాడు.

అతను పిల్లల మీద దుప్పటి కప్పి, భార్యనెత్తి తెచ్చి మంచంమీద పడుకోబెట్టి మంచం కోడు పట్టె మీద కూర్చుని రత్తమ్మ ముఖంలోకి చూస్తూ ఉన్నాడు. ఆమె గుడ్లు విప్పార్చి అతణ్ణి చూస్తూ ఉంది.

సుధాకరరావు తన ఆలోచనల్లో తానున్నాడు. ఆమె అతడి చేయి పట్టుకొంది.

కళ్లనిండా నీళ్లు.

తూరుపు తెలిరేకలు విచ్చుకొంటున్నాయి.

భర్త కొత్తగా కనబడసాగాడు. కళ్లు తుడుకుకొని లేచి, వాకిలి దాటి బయటికి వచ్చాడు.

భార్య వెంట వచ్చింది.

వేపచెట్టు పుల్ల విరుచుకొని పళ్లు తోముకోసాగాడు.

ఆమెకు ఆశ్చర్యంగా ఉంది.

ముఖం కడుక్కొని రాతి తొట్టిలోని నీళ్లు తలమీద పోసుకోసాగాడు.

విప్పిన బట్టలు తడిప్పెట్టి, టవలు తెచ్చి నిలబడింది రత్తమ్మ.

కొబ్బరి పీచుతో తలా, వళ్లూ రుద్ది తోమి, కడిగి, నీళ్లు పోసుకొన్నాడు.

రత్తమ్మకు ఆనందంగా ఉంది. మనిషిలో ఏదో మార్పు కనబడసాగింది.

ఉతికి ఉంచిన పేంటు షర్టు తెచ్చింది. తలా వళ్లు తుడుచుకొన్న టవలు భార్యకిచ్చి ఉతికిన బట్టలు వేసుకొన్నాడు.

రత్తమ్మ భర్త తల మళ్లీ తుడిచింది. కళ్లు ముక్కు, చెవులు, మెడ తుడిచింది. బండ మీద కూర్చుంటే చేతులూ, కాళ్లూ ఒత్తింది.

ఆలోచనల్లోకి మళ్లీ కూరుకుపోయాడు.

మెడిసిన్ అయిదేళ్ల క్రితమూ, నాలుగేళ్ల క్రిందటా సీటు వస్తుందనే అందరూ అన్నారు.

కోర్టు, కేసు తీర్పు వెలువడిందాకా, రిజర్వేషన్ రెండేళ్ల పూర్వమున్నట్లే వర్తిస్తాయని మధ్యంతర తీర్పు ఇచ్చింది. ఇది ఐదు ఏళ్ల కిందటి తీరు.

నాలుగేళ్ల క్రిందట కోర్టు తుది తీర్పు వెలువరించింది. వర్గీకరణం చెల్లదని.

యస్.సి. – బి గా అయితే రెండుసార్లూ అతడికి సీటు వచ్చేది. డాక్టరు అయ్యేవాడు.

యస్.సి.గా అయితే సీటు రాదు. రాలేదు. రెండుసార్లూ తప్పిపోయాయి, డాక్టరు అయ్యే అవకాశాలు.

'నీ సీటు ఎవరికి వచ్చింది'

'కేసు పెట్టి తీర్పు తెప్పించుకొన్న వాళ్లలో ఒకరికి'

'వాళ్ల మీద నీకు కోపం లేదా?'

'వాళ్లూ నా సోదరులే కదా!'